రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్‌స్పాట్లలో పెండింగ్ పనులను పూర్తి చేయండి
- కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు
- జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు.. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్లాక్ స్పాట్లలో సైన్‌బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయా పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి వద్ద రహదారి విస్తరణ పనులకు రూ.కోటి మంజూరైందని, టెండర్లను కూడా పిలిచినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి వివరించారు. రూ.40 లక్షలతో చేపట్టిన నాలుగు పనులు ఏప్రిల్‌లోపు పూర్తవుతాయని, అనంతపురం జాతీయ రహదారుల విభాగం పీడీ కలెక్టర్‌కు వివరించారు. కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్లను గుర్తించి రూ.118 లక్షలతో పనులు చేపడుతున్నట్లు జాతీయ రహదారుల పీడీ వివరించారు. అలాగే ఎన్‌హెచ్ 340సీ లో చేపడుతున్న పనులపై కలెక్టర్ ఆరా తీయగా ఆయా పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. కర్నూలు సమీపంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద అప్రోచ్ రోడ్డు కోసం భూమిని అప్పగించి నెల రోజులవుతున్నా పనులు మొదలు పెట్టకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దపాడు నుంచి హైదరాబాద్ రోడ్డును లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరణ పనులు చేపట్టాలని కర్నూలు మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బళ్లారి చౌరస్తా వద్ద జంక్షన్ విస్తరణ పనులు పూర్తయ్యాయని, ప్రభుత్వ ఆస్పత్రికి ఎంట్రన్స్, పార్కింగ్ ఏర్పాటు అంశాలపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను ఆదేశించారు. యాక్సిడెంట్ జరిగిన ప్రాంతాలకు సంబంధిత శాఖల అధికారులు వెళ్లి ప్రమాదాలకు కారణాలను అన్వేషించాలన్నారు. రోడ్లు బాగోలేకపోతే వెంటనే వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, డీటీసీ శాంతకుమారి, హాస్పిటల్ ఏఓ సింధు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లాలో 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా మాస్టర్ క్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా యువజన శాఖ, సెట్కూరు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత ఆన్‌లైన్ మాస్టర్ క్లాస్ శిక్షణ తరగతులను శుక్రవారం డీఈఓ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ ల్యాబ్ ద్వారా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నైపుణ్య ఐఏఎస్ కోచింగ్ అకాడమీ సహకారంతో విద్యార్థులకు ఈ నెల 25 నుంచి మే 28వ తేదీ వరకు కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధిపైశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పైతరగతుల్లో ఏ సబ్జెక్టులు ఎంచుకోవాలి, తమకు ఏదీ అనుగుణంగా ఉంటుందోనని విశ్లేషించుకోవడంతో పాటు, జనరల్ నాలెడ్జ్ వివిధ అంశాల్లో నైపుణ్యం పొందేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అలాగే పదో తరగతిలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా రెమిడియల్ తరగతులను ప్రారంభిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామూల్ పాల్ మాట్లాడుతూ.. ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు సంబంధించిన లింక్ వివరాలను క్లాస్ టీచర్ ద్వారా విద్యార్థులకు షేర్ చేయడం జరుగుతుందన్నారు. సెట్కూరు సీఈఓ డా.కె వేణుగోపాల్, నైపుణ్య ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పరిశ్రమలను స్థాపించేందుకు ఆసక్తి కలిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా బ్యాంకర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండోలో నిర్దేశించిన సమయంలోపు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తులను సకాలంలో పరిశీలించి బ్యాంకులు రుణాలను మంజూరు చేయాలన్నారు. ఉల్లి, మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి కలిగిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక ప్రకటన ఇవ్వాలని పరిశ్రమల శాఖ జీఎం, ఎల్‌డీఎంలను ఆదేశించారు. ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులు 67 శాతం పూర్తయినట్లు ఏపీఐఐసీ జెడ్ఎం చెప్పగా మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం రూ.1.08 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు కమిటీ ఆమోదం తెలిపింది. పరిశ్రమల శాఖ జీఎం అరుణ, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసరెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజా మహేంద్రనాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రారావు, వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కోడుమూరు రూరల్: గూడూరు మండలం కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెరవాడ గ్రామానికి చెందిన శశిరేఖ (19) అదృశ్యమైందంటూ తల్లిదండ్రులు కె.నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెరవాడకు చెందిన రాజశేఖర్ కుమార్తె శశిరేఖ పదవ తరగతి సంప్లిమెంటరీ పరీక్షలు రాసింది. ఇటీవల ఫలితాలు వెలువడడంతో ఈనెల 24వ తేదీన పెద్దపాడు హైస్కూల్‌కు వెళ్లి మార్కులు చూసుకొని వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లింది. అయితే ఎంతకు తిరిగిరాకపోవడంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ శుక్రవారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి వెల్లడించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): రిటైర్డ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ రాజగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన ఏపీ ఎస్‌సీఆర్ ఏసీడబ్ల్యూ స్టేట్ కో–ఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా పనిచేసి 2015లో పదవీ విరమణ పొందగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో విరక్తి చెంది గురువారం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన భౌతిక కాయానికి ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు సంఘం తరఫున రూ.5 వేలను కుటుంబ సభ్యులకు అందించారు. కార్యవర్గ సభ్యులు గౌస్‌బాషా, రమేష్, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా పల్లకీసేవ


శ్రీతిమ్మ గురుడు స్వామికి పూజలు నిర్వహిస్తున్న ప్రజలు

కోడుమూరు రూరల్: గూడూరులో తిమ్మగురుడు స్వామి తిరుణాల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడసేవ, పల్లకీసేవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మగురుడు స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. శనివారం పారువేట, ఆదివారం వసంతోత్సవం కార్యక్రమాలను నిర్వహించేందుకు దేవదాయశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు ఆటల పోటీలు

కోడుమూరు రూరల్: గూడూరులో వెలసిన తిమ్మగురుడు స్వామి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 26వ తేదీ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటల పోటీల్లో భాగంగా స్పీడ్ సైకిల్ పోటీలు, పరుగు పందెం, బ్యాలెన్స్ మోటార్ పందెం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎల్.వెంకటేశ్వర్లు తెలియజేశారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


చిన్నరాముడు (ఫైల్)

కోడుమూరు రూరల్: ఉపాధి పనికి వెళ్లిన కూలీ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన లద్దగిరి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. లద్దగిరికి చెందిన పట్టి చిన్న రాముడు (36) భార్య గంగావతితో కలిసి శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వలో పూడికతీత పనులకు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా కొద్దిసేపటికే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. పక్కనున్న కూలీలు చికిత్స నిమిత్తం లద్దగిరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు చిన్నరాముడుకు పదేళ్లలోపు వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి ఏపీఓ మోదీన్‌బాషా, లద్దగిరి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్లూరు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించరాదని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బొల్లవరం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. విధుల నిమిత్తం క్షేత్ర పర్యటనలకు వెళ్తే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో ఎంటర్ చేయాలన్నారు.

పొలాల రస్తాను ఆక్రమించారు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో పొలాలకు వెళ్లే దారిని సోలార్ కంపెనీ యాజమాన్యం ఆక్రమించడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. రైతులకు దారి చూపకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అంతకు ముందు గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే గౌరిచరితారెడ్డికి అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం జిల్లా నాయకులు ప్రసాద్, పిన్నాపురం రైతులు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్లతో గోరుకల్లుకు మరమ్మతులు

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ కట్ట కుంగిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే గౌరు చరితా శుక్రవారం పరిశీలించారు. ఈఈ సుభకుమార్‌ను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్ట తాత్కాలిక మరమ్మతు పనులను రూ.2.50 కోట్లతో చేయనున్నట్లు వెల్లడించారు. తెలిపారు. అనంతరం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంతో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ కోటయ్య, డీఈఈ జ్యోతి పాల్గొన్నారు.

నూనె గింజల పంటలకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నూనె గింజల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం తన చాంబరులో నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబిల్ ఆయిల్స్ (ఆయిల్ సీడ్స్) కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ విభాగం ద్వారా క్రిశోన్నతి పథకం కింద నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్స్ సీడ్‌ను కొత్తగా ఏర్పాటు చేశారని, దీని ద్వారా జిల్లాలో ఐదేళ్లలో నూనెగింజల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఖరీఫ్, రబీలో ఒక్కో సీజన్‌లో 500 హెక్టార్లలో నూనె గింజల పంటలను సాగు చేసేలా అన్నదాతలకు సూచించాలని అధికారులను ఆదేశించారు. 200 మంది రైతులను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాలని సూచించారు. వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు వంటి నూనె గింజలను సాగు చేసేందుకు అన్నదాలకు అవసరమైన విజ్ఞానం, శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ల ద్వారా రైతులకు అవసరమైన లోన్లను బ్యాంకుల ద్వారా ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, కోఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు, ఉద్యాన అధికారి రామాంజనేయులుపాల్గొన్నారు.

27న మహా సుదర్శన యజ్ఞం

కర్నూలు(అర్బన్): ఓర్వకల్ మండలం బొడ్డువానిపల్లెలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేదీన అమావాస్య సందర్భంగా మహా సుదర్శన యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఏ.వెంకటేశ్వర్లు, బీ.అరుణ్‌కుమార్ తెలిపారు. యజ్ఞాన్ని జీ.విశ్వనాథ శాస్త్రి నిర్వహిస్తారని ముఖ్య అతిథిగా విరివింటి ఫణి శశాంక శర్మ హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలోనే 26న రాత్రి 8 గంటలకు వీరయ్యపల్లె భజన బృందంచే, 27న ఉదయం 9 గంటలకు కల్లూరు భీమేశ్వర భజన బృందం, పుల్లగుమ్మి వెంకటేశ్వరరెడ్డి భజన బృందం చేత భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 27న ఉదయం 10 గంటలకు కర్నూలు జమ్మిచెట్టు వారిచే కోలాటాలు, 11 గంటలకు లొద్దిపల్లె వారిచే నందికోల సేవ ఉంటుందని వివరించారు. 27న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజలు ఉంటాయని వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.


ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉగ్రదాడి హేయమైన చర్య

కల్లూరు: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్ వర్ధన్‌రెడ్డి అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం రాత్రి ఆ కాలేజీ విద్యార్థినులు, అధ్యాపకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ అశోక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో జాతీయ సమైక్యతకు ప్రాధాన్యం ఇస్తూ బాధిత కుటుంబాలకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

9 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు


శకునాలలో లఘ్నపత్రిక లిఖిస్తున్న అర్చకులు మనోహర్‌శర్మ తదితరులు

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, శకునాల గ్రామాల్లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు చేశారు. శుక్రవారం స్థానిక చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆయా గ్రామాల అర్చకులు నారాయణరావు శర్మ, విష్ణుశర్మ, మనోహర్‌శర్మ, ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో ఉత్సవాలకు సంబంధించి లఘ్న పత్రిక రాసి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి సమర్పించారు. అందులో మే 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 10వ తేది తెల్లవారుజామున కల్యాణోత్సవం, అదేరోజు సాయంత్రం 6.00 గంటలకు ఊరేగింపు, 11వ తేది సాయంత్రం ప్రభోత్సవం, 12వ తేది రథోత్సవం, 13వ తేది ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పార్వేట కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముతో అవస్థలు


గడివేములలో భారీ వాహనం వెళ్తుండటంతో దుమ్ములేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో భారీ వాహనాల రాకపోకల సమయంలో ఏర్పడే దుమ్ముతో వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ భారీ వాహనాలు గడివేములలో వెళ్తునప్పుడల్లా పెద్ద ఎత్తున దుమ్ములేస్తోంది. కేటాయించిన రహదారిలో ఆ పరిశ్రమ వాహనాలు వెళ్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. అనుమతి లేకున్నా వాహనాలు గ్రామంలోకి రావడంతో దుమ్ము లేచి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి ఆ వాహనాలు గ్రామంలోకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌లో కేసు రాజీ

కర్నూలు(సెంట్రల్): ఇంటి నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో బాధితురాలు లోక్ ఆదాలత్‌ను ఆశ్రయించి రాజీ మార్గం ద్వారా న్యాయం పొందారు. వివరాలు.. 2022లో కర్నూలుకు చెందిన ఎం.సునీత ఓ బిల్డర్ నుంచి రూ.76,70,000లకు ఇంటిని కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో రెండేళ్లకే పగుళ్లు వచ్చాయి. దీనిపై ఆమె 2025 జనవరి 30న బిల్డర్‌కు లీగల్ నోటీసు పంపారు. బిల్డర్ తనకు సంబంధం లేదని బదులివ్వడంతో సునీత లోక్ అదాలత్‌ను ఆశ్రయించింది. ఈ క్రమంలో వాది, ప్రతివాది రాజీ అయ్యి కేసును పరిష్కరించుకున్నారని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకరరెడ్డి, డి.రాజు బాబు వెల్లడించారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా త్వరగా కేసులను పరిష్కరించుకోవచ్చని వారు తెలిపారు.

పూర్తి జీతాలు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలోని నాన్‌టీచింగ్ టైంస్కేల్ ఉద్యోగులు నెలనెలా తమ పూర్తి జీతాలు చెల్లించాలని వర్సిటీ ఉద్యోగులు మీనాక్షిరెడ్డి, రమేష్, సురేంద్ర రెడ్డి, రఘునాథ్ తదితరులు కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పేరుతో ప్రతి నెలా ఉద్యోగి జీతం నుంచి రూ.50 కట్ చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై రిజిస్ట్రార్‌ను పలుమార్లు కలిసి వినతి పత్రం సమర్పించినా స్పందించడం లేదన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, హ్యూమన్ రైట్స్, ట్రెజరీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

నేడు న్యాయాధికారులకు వర్కుషాపు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని న్యాయాధికారులకు శనివారం జిల్లా కోర్టులో వర్కుషాపు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లిమిటేషన్ యాక్ట్‌పై వర్కుషాపు జరుగుతుందని, జిల్లాలోని జూనియర్, సీనియర్ జడ్జీలు, అదనపు జిల్లా జడ్జీలు హాజరు కావాలన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కమిటీ నాయకులు పద్మ, పీఎస్.సుజాత, మశుక్రవారంహేశ్వరి, సావిత్రి తదితరులు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో మహిళా కార్మికులు, ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. అధికారులు స్పందించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల నివారణకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

విత్తనాలను అధిక ధరకు అమ్మితే చర్యలు


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలను, నిర్ణీత ధరకే అమ్మాలని, అధిక ధరకు అమ్మినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం సి.బెళగల్లోని విత్తన విక్రయ దుకాణాలైన ఓం శ్రీ నాగసాయి ఏజెన్సీ, కిసాన్‌మాల్, మన గ్రోమోర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని, ప్రతి అమ్మకంపై తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. రైతులు సైతం విత్తనం నాటుకున్న తరువాత ఖాళీ విత్తన ప్యాకెట్లను, విత్తన కొనుగోలు రసీద్‌లను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని ఏఓ సూచించారు. ప్రభుత్వం 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధరను రూ.901గా నిర్ణయించిందని చెప్పారు. విత్తన నమూనాలను సేకరించి విశాఖపట్నం ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఏఓ తెలిపారు. లూజు విత్తనాల అమ్మకాలపై సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం


కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు రోగాలకు దూరంగా ఉండొచ్చని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న సూచించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా సంక్రమించే మలేరియా పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. చలి వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. ప్రజలంతా దోమలు కుట్టకుండా విరివిగా దోమతెరలు వాడడంతో పాటు, ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన చికిత్స అందించాలని సూచించారు. ఎంపీహెచ్ ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..
ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ షఫీయా, డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ.. దోమకాటు వల్ల సంక్రమించే మలేరియా పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల శుభ్రతతో దోమలను నివారించవచ్చన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం


గడివేములలో మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: దోమలను నివారించుకుని మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రంజితకుమారి అన్నారు. మండల కేంద్రమైన గడివేముల పీహెచ్‌సీ నుంచి పాతబస్టాండు వరకు శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవంపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ దేశంలోనే ఏపీ రక్తనమూనాల సేకరణలో ముందుందన్నారు. అధిక రోజులు జ్వరం, తలనొప్పి ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా నివారణ మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్టు రాజ్‌కుమార్, ఏఎన్‌ఎంలు భారతి, మౌలాబీ, వైద్యసిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తాం


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పిస్తామని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అన్నారు. శుక్రవారం బస్తిపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారందరూ పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకుని వెళ్లాలని సూచించారు. అనంతరం రోజ్‌గార్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.